

లాయర్లపేట

ఆ పల్లె ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. పంటల సాగులోని కష్టనష్టాలు తెలుసు. అవేమి వారి పిల్లలు పడకూడదని ఉన్నత చదువులు అందించారు. 8లో▸



కాంగ్రెస్‌ది మోసపూరిత పాలన

కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని, రైతుభరోసా సొమ్ము ఎగ్గొట్టిందని, రుణమాఫీలో కోత విధిస్తోందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/21.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెరువులు, కుంటలకు జలకళ



నీటితో కళకళలాడుతున్న మోతె చెరువు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మోస్తరు వర్షానికి చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. వరి నార్లు పోసుకున్న రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు. పొలాలను దున్నుతున్నారు. శనివారం ఉదయం 8.30 వరకు జిల్లాలో సగటున 4.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇబ్రహీంపట్నంలో 3.7 మిల్లీ మీటర్లు, మల్లాపూర్‌లో 4.4, రాయికల్‌లో 3.2, బీర్‌పూర్‌లో 6.2, సారంగాపూర్‌లో 4, ధర్మపురిలో 4.7, బుగ్గారంలో 6.6, జగిత్యాల రూరల్‌లో 4.3, జగిత్యాల అర్బన్‌లో 4.8, మేడిపల్లిలో 3.4, కోరుట్లలో 3.3, మెట్‌పల్లిలో 4.1, కథలాపూర్‌లో 3.3, కొడిమ్యాలలో 3.8, మల్యాలలో 3.8, పెగడపల్లిలో 5.1, గొల్లపల్లిలో 3.2, వెల్గటూర్‌లో 8, ఎండపల్లిలో 7.1, భీమారంలో 3.9 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది.

18.131టీఎంసీలకు ఎస్సారెస్పీ

ఎస్సారెస్పీ నీటిమట్టం 18.131 టీఎంసీల (1066.60 అడుగులు)కు చేరింది. గతేడాది ఇదే రోజు 28.541 టీఎంసీలు(1072.90 అడుగులు)గా ఉంది. ఎగువ నుంచి 18,275 క్యూసెక్కుల వరద వస్తోంది. 489క్యూసెక్కుల నీటిని తాగునీటి కోసం విడుదల చేస్తున్నారు.

డెంగీ నివారణకు చర్యలు



జగ్గాసాగర్‌లో సూచనలు చేస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్: జిల్లాలో డెంగీ వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడుతున్నామని డీఎంహెచ్‌వో సమియొద్దీన్ అన్నారు. మండలంలోని జగ్గాసాగర్‌లో శనివారం పర్యటించారు. గ్రామంలో డెంగీ సోకిన ఓ వ్యక్తి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి, చికిత్స అందుతున్న విధానం తెలుసుకున్నారు. కాలనీవాసులకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

జ్వరం ఉంటే పరీక్షలు చేసుకోవాలి

జ్వరం లక్షణాలు ఉన్నవారందరూ తప్పనిసరిగా రక్త పరీక్షలు చేసుకోవాలని సమియొద్దీన్ అన్నారు. మల్లాపూర్ మండలం హుస్సేన్‌నగర్‌ను వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించారు. సీజనల్ వ్యాధులు, విషజ్వరాలతో బాధపడుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డెంగీ జ్వరం నిర్ధారణ అయిన ఇద్దరి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసిబ్బందితో దోమలపై స్ప్రేచేయించారు.

కుక్కల బెడద తప్పించండి..



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి

- సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు
- మురికి కాల్వల్లో నీరు నిలవలు లేకుండా చూస్తాం
- దోమలు, కుక్కల బెడద తొలగిస్తాం
- 'సాక్షి ఫోన్ ఇన్'లో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల/కోరుట్లటౌన్/మెట్‌పల్లి/గొల్లపల్లి,ధర్మపురి/ కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి మున్సిపాలిటీల పరిధిలో సమస్యలపై 'సాక్షి' నిర్వహించిన 'ఫోన్‌ఇన్' కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వచ్చింది. సీసీ రోడ్లు, మురికి నీటి ఇబ్బందులు, దోమలు, కుక్కలతో ఎదురవుతున్న సమస్యలను పలువురు కమిషనర్ల దృష్టికి తీసుకొచ్చారు. వారందరికీ కోరుట్ల కమిషనర్ తిరుపతి, మెట్‌పల్లి కమిషనర్ మోహన్, ధర్మపురి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సమాధానమిచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలకు సరైన పరిష్కారం దొరికిందా..? లేదా అన్న విషయమై మళ్లీ సిబ్బందితో సమీక్షిస్తామన్నారు.



ధర్మపురి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశ్న: పట్టణంలో వర్షం నీరు నిలిచి రోడ్లు బురదమయం అవుతున్నాయి
– అల్లె ధనుంజయ్, తోటరాజేశం, 29వ వార్డు
కమిషనర్: ఎల్‌జీఎస్ స్కూల్, విజయ హాస్పిటల్, రాజలింగం ఫొటోస్టూడియో, ప్రసాద్ సెలక్షన్స్ వీధుల్లో డ్రయినేజీల ఎత్తు పెంచి అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాం. సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదు. నిధులు రాగానే ప్రాధాన్యం ఇస్తాం.

ప్రశ్న:ఆదర్శనగర్‌లో కుక్కలు, దోమల బెడదను నివారించండి– **నర్సయ్య, పవన్‌కుమార్, జుంబర్తి విద్య, వెంకటరమణ**
కమిషనర్: కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఆదర్శనగర్‌లో దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయిస్తాం. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు తొలగించాలని, నీరు నిల్వలేకుండా చేయాల ని యజమానులకు నోటీసులు ఇచ్చాం.
ప్రశ్న: టీటీడీ కల్యాణ మండపం చుట్టూ నీరు నిలిచి పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి.
– మార్గం నరేష్‌కుమార్, నరేందర్, 9 వవార్డు
కమిషనర్: రెండు రోజుల్లో పరిసరాలు శుభ్రం చేసి సమస్యను పరిష్కరిస్తాం.
ప్రశ్న: టీచర్స్ క్లబ్ రోడ్ ఎల్‌జీఎస్ స్కూల్ వద్ద మురికి నీరుతో డ్రయినేజీ నిండిపోయింది
– నాగరాజు, 29వ వార్డు
కమిషనర్: ఈ ప్రాంతంలో కల్వర్టు సమస్యను పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
ప్రశ్న: మెయిన్‌రోడ్‌లో కోనోకార్పస్ చెట్లు తొలగించండి **– తిరునగరి రమణ**
కమిషనర్: ఈ విషయం పరిశీలనలో ఉంది. అవసరమైన చర్యలు చేపడతాం.
ప్రశ్న: మెయిన్‌రోడ్‌లో రెండు రెస్టారెంట్ల నుంచి వ్యర్థాలు వస్తున్నాయి– **కోగిలకృష్ణ, బోయిని భారతి**
కమిషనర్: పరిష్కారానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించి రెస్టారెంట్లకు నోటీసులు జారీ చేస్తాం.
ప్రశ్న:ఒకటో వార్డులో కొత్త రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు..?
– సత్యనారాయణరావు, ఒకటో వార్డు
కమిషనర్: రోడ్లుకు టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయిస్తాం. ప్రస్తుతం మురికి నీరు నిలవకుండా రోడ్డుపై గుంతలు బాగు చేయిస్తాం.
ప్రశ్న: 33వ వార్డులో డ్రైనేజీని బాగు చేయించండి. **– రాంచంద్రం**
కమిషనర్: అవసరమైన చర్యలు తీసుకుని డ్రయినేజీ సమస్య లేకుండా చూస్తాం.
ప్రశ్న:గోదాం ఏరియాలో చెట్ల కొమ్మలు ఎండిపోయి రోడ్డుపై పడుతున్నాయి
– ప్రశాంత్, వాజిద్, 25వ వార్డు, ఐబీరోడ్
కమిషనర్: త్వరలో ఎండిన కొమ్మలు తొలగిస్తాం.
ప్రశ్న: వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు **– విజయసాయి, అడ్వకేట్**
కమిషనర్: వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
ప్రశ్న:ఎఖీన్‌పూర్‌లో హైమాస్ లైట్లు రావడం లేదు.
– ఫణీందర్,గౌతమ్, బన్న రాజేశ్, రాస భూమయ్య
కమిషనర్ : హైమాస్ట్ లైట్లు వెలిగేలా సి బ్బందిని పంపించి వెంటనే బాగు చే యిస్తాం. మురికి కాలవలు బాగు చేయిస్తాం. దోమలు, కుక్కలను నియంత్రిస్తాం.

ప్రశ్న:ధర్మపురిలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. నివారించండి
– స్తంభంకాడి గణేశ్ 11వ, వార్డు
కమిషనర్: పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉన్న విషయం వాస్తవమే. వాటిని హతమార్చే హక్కు లేదు. వాటిని అరికట్టడానికి మాత్రం త్వరలోనే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటాం.
ప్రశ్న: రోడ్లపై ఆవులు సంచరిస్తున్నాయి. ఇబ్బంది పడుతున్నం
– రంగు లక్ష్మినరహరి తోట్లవాడ, పదోవార్డు
కమిషనర్: రోడ్లపై ఆవులు తిరగకుండా తీసుకెళ్లాలని వాటి యజమానులకు నోటీసులు జారీ చేశాం. వారు స్పందించకుంటే వాటిని గోశాలకు పంపించే ఏర్పాట్లు చేస్తాం. వర్షాకాలంలో డెంగీ, మలేరియా ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం.
ప్రశ్న: శ్మశాన వాటిక నిర్వహణ సరిగాలేదు. గదులన్నీ అపరిశుభ్రంగా మారాయి..?
– స్తంభంకాడి జగదీశ్వర్ సంగివాడ
కమిషనర్: భారీ వర్షాల కారణంగా గోదావరి ఒడ్డున నిర్మించిన శ్మశాన వాటికలోకి బురద చేరి అపరిశుభ్రంగా ఉన్నాయి. బురదను తొలగించి గదులను ఉపయోగంలోకి తెస్తాం.
ప్రశ్న: వారసంతతో ఇబ్బంది ప్రజలు పడుతున్నారు **– పప్పుల శ్రీనివాస్, 11వ, వార్డు**
కమిషనర్: కూరగాయల మార్కెట్ కోసం సమీకృత మార్కెట్‌ను నిర్మించాం. అవి ఉపయోగకరంగా లేవని రైతులు రోడ్లపైనే విక్రయిస్తున్నారు. రోడ్డుకు ఒకవైపు ఖాళీగా ఉంచి వాహనదారులు వెళ్లేలా చూస్తాం.
ప్రశ్న: డివైడర్లలో కోనోకార్పస్ మొక్కలు తొలగించాలి **– గాజు భాస్కర్, రెండో వార్డు**
కమిషనర్: రోడ్డు మధ్యలో కోనోకార్పస్ మొక్కలను గతంలోనే ఏర్పాటు చేశారు. వాటిని తొలగించి పూలమొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటాం.
ప్రశ్న: గోదావరికి కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారా..? **– గునిశెట్టి రవీందర్**
కమిషనర్: గోదావరికి వరదలు వస్తే తీరప్రాంత వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆస్తినష్టం కలుగుతున్న మాట వాస్తవమే. కరకట్ట నిర్మాణం మున్సిపాలిటీ చేతులో లేదు. నిర్మాణంపై పైఅధికారులకు నివేదిస్తాం.

ప్రశ్న: వ్యర్థపు నీరు ఎస్సారెస్పీ కెనాల్‌లోకి వదులుతున్నారు.. దుర్గంధం వెదజల్లుతోంది
– స్వామి, ఆరో వార్డు
కమిషనర్: ఆరోవార్డులో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది నిజమే. అయితే ఆ నిర్మాణం మా చేతిలో లే దు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్య పరి ష్కారానికి కృషి చేస్తాం. ఎస్సారెస్పీ కాలవలోని పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచుతాం.

ప్రశ్న: గోదావరి అపరిశుభ్రంగా మారింది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?
బెజ్జారపు లవన్‌కుమార్, రెండోవార్డు
కమిషనర్: గోదావరిలో భక్తులు పడేసిన దుస్తులు, వస్తువులతో కలుషితంగా మారుతోంది. ఇందుకోసం ప్రత్యేక కుండీలను ఏర్పాటు చేశాం. అయినప్పటికీ కొందరు భక్తులు గోదావరిలోనే బట్టలను పడేస్తున్నారు. అయినా చర్యలు తీసుకుంటాం.



మాట్లాడుతున్న కమిషనర్ మోహన్

ప్రశ్న: పట్టణంలోని 8, 9, 15, 23 వార్డుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది.
– రైసుద్దీన్, కుమార్, రహీముద్దీన్, అఫ్రోజ్
కమిషనర్: కుక్కల బెడదతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయాం. వారి ఆదేశాల మేరకు వాటి నియంత్రణపై చర్యలు తీసుకుంటాం.
ప్రశ్న:12వార్డులోని టీచర్స్ కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేవు.
– ఆగమయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు
కమిషనర్: శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాం. ఆయా కాలనీల్లో దశల వారీగా మౌలిక వసతులను కల్పిస్తాం.
ప్రశ్న: 20వార్డులో రోడ్డుపైనే వర్షం నీరు నిలిచి ఉంటోంది **– గాదె నర్సింగరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు**
కమిషనర్: వర్షపు నీరు నిలిచి ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటాం
– మాశెట్టి భీమ్‌శెట్టి, వెంకట్రావ్‌పేట
కమిషనర్: ఈ విషయంలో ఓపెన్ ప్లాట్ల యాజమానులకు నోటీసులు ఇస్తాం. పిచ్చి మొక్కలు, వర్షను నీరు నిలిచి ఉండకుండా చర్యలు చేపట్టాలని వారికి సూచిస్తాం.
ప్రశ్న: వేంపేట రోడ్డులో రైల్వే వంతెన కింద వరద నీరు నిలుస్తోంది
– ప్రవీణ్‌కుమార్, 3వార్డు
కమిషనర్: నిర్మాణంలో లోపాలతో వంతెన కిందకు నీరు వచ్చి చేరుతోంది. దీనిని శాశ్వతంగా పరిష్కరించాలనే ఆలోచన చేస్తున్నాం. అప్పటి వరకు ప్రత్యామ్నాయ చర్యలతో ఇబ్బందులను తొలగిస్తాం.

ప్రశ్న: ఒకటోవార్డు బంటుపేట, 10వార్డులో దోమల బెడద ఎక్కువగా ఉంది. **– కంభ శంకర్, మనోజ్**
కమిషనర్: వర్షాకాలంలో దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతోపాటు ప్రతి రోజు వీధుల్లో ఫాగింగ్ చేయాలని నిర్ణయించాం.
ప్రశ్న:ఓపెన్ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు.



సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

తేదీ : 22.07.2024
సమయం 9.30 నుంచి 10.30 వరకు
ఫోన్ నంబరు 98499 05877

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



ధర్మపురి వద్ద గోదావరిని పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్మపురి: గోదావరిలో ప్రవాహం పెరుగుతున్నందున తీర ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురితోపాటు మండలంలోని రాయపట్నం వద్ద గోదావరి పరీవాహక ప్రాంతాలను శనివారం సందర్శించారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద పెరుగుతోందని, తీరప్రాంత వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్, పోలీస్ అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలని, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా జాలీలు అమర్చాలని సూచించారు. పాత, మట్టిగోడలతో నిర్మించిన ఇళ్లలో ఉండొద్దని ప్రజలకు సూచించారు. అత్యవసర సమయంలో 100కు ఫోన్ చేయాలన్నారు. ఆర్డీవో మధుసూదన్, డీపీఓ దేవరాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రవీందర్ తదితరులున్నారు.

ప్రజాపాలన కేంద్రాన్ని వినియోగించుకోవాలి

జగిత్యాల: ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రజాపాలన సేవ కేంద్రాన్ని పరిశీలించారు. ఆరుగ్యారంటీల్లో గ్యాస్‌సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లోటుపాట్లు ఉంటే సరిచేయాలన్నారు. కేంద్రం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు రేషన్‌కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబరు, గ్యాస్ కనెక్షన్ నంబరు, కస్టమర్ ఐడీ, మొబైల్ నంబరు వెంట తెచ్చుకోవాలన్నారు.

ఆరోగ్యకేంద్రం తనిఖీ

వెల్గటూర్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎండపల్లి మండలం అంబరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ సేవలు, ల్యాబ్ రికార్డ్స్, హాస్పిటల్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసీని తనిఖీ చేశారు. హాస్పిటల్లో ప్రసూతి సేవలు, వైద్య సేవలు మెరుగుపరచాలని, డాక్టర్లు సమయపాలన పాటించాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పేషెంట్లకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. నార్మల్ డెలివరీలు అయ్యేలా చూడాలని, చిన్న పిల్లలకు ఇన్ఫెక్షన్‌లపై సమాచారం తెలుసుకొని వైద్య సేవలు అందించాలని సూచించారు.


షరతులు వర్తిస్తాయి

- రేషన్‌కార్డు, ఆధార్ లింకేజీ, పీఎం కిసాన్ ప్రామాణికం
- రుణాలు ముందే చెల్లించినా, రీషెడ్యూల్ చేసుకున్నా వర్తించని వైనం
- మిగిలిన అవుట్ స్టాండింగ్ రుణం మాత్రమే మాఫీ
- అర్హులైనా తమకు మాఫీ కాలేదని రైతుల ఆవేదన
- బ్యాంకులు, రైతు వేదికలకు బారులు తీరిన అన్నదాతలు
- మళ్లీ దరఖాస్తు చేస్తే వర్తింపజేస్తామని సూచన





ఆన్‌లైన్‌లో రుణమాఫీ స్టేటస్



ఆన్‌లైన్‌లో రుణమాఫీ స్టేటస్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రైతు రుణమాఫీ విషయంలో అర్హులకు అన్యాయం జరిగిందని విమర్శలు వినిపిస్తున్న వేళ.. అధికారులు పలు కొత్త కారణాలు చెబుతున్నారు. రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెప్పినప్పటికీ.. వాస్తవానికి కుటుంబాల గుర్తింపులో వాటినే ప్రామాణికంగా తీసుకున్నారని అధికారులే చెబుతుండటం గమనార్హం. మరోవైపు.. రూ.లక్షలోపు రుణం తీసుకున్న వారిలో ఉమ్మడి జిల్లాలో 1.24 లక్షల మందికి రుణం మాఫీ కాగా.. వాస్తవానికి గత ప్రభుత్వంలో ఈసంఖ్య 3 లక్షలు దాటి ఉంది. వారిలో మిగిలిన వారంతా తమకు ఎందుకు రుణమాఫీ కాలేదని దాదాపుగా రెండు లక్షల మంది కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో శనివారం ఉదయం నుంచే రైతువేదికలు, బ్యాంకులకు పోటెత్తారు.అక్కడ అధికారులు చెప్పిన కారణాలు విని కొందరు రుణమాఫీపై ఆశలు వదులుకోగా.. మిగిలిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

అసలేంటి ఆ కారణాలు?

- వాస్తవానికి ప్రభుత్వం ఆదినుంచీ చెబుతున్నట్లు తాను విధించిన నిబంధనల మేరకు మాఫీ చేసింది.
- అందులో మొదటగా.. కాలపరిమితి 12–12–2018 నుంచి 09–12–2023 మధ్య రుణం తీసుకుని ఉండాలి. అలా కాకుండా అంతకుముందు, ఆ తర్వాత తీసుకున్న వారికి రుణమాఫీ కాలేదు.
- ఐదేళ్లలో పంట రుణం తీసుకుని మొత్తాన్ని(రుణవాయిదా) బ్యాంకులకు చెల్లిస్తే.. ఆ రుణాలకు మాఫీ వర్తించదు.
- 09–12–2023 నాటికి లోను ఖాతాలో ఉన్న అవుట్ స్టాండింగ్ అమౌంట్ ఎంత ఉంటే అంత మాత్రమే మాఫీ అయింది. ఉదాహరణకు రూ.లక్ష రుణం తీసుకున్న వ్యక్తి పేర్కొన్న తేదీ 09–12–2023 నాటికి రూ.50 వేలు చెల్లించాడనుకుందాం.. అతనికి ఇపుడు కేవలం రూ.50 వేలు మాత్రమే మాఫీ అవుతుంది. వీరు తమకు రూ.లక్షకు బదులు రూ.50 వేలే మాఫీ అయ్యాయని వాపోతున్నారు.
- రేషన్‌కార్డు లేనివారికి రుణాలు మాఫీ కాలేదు. ప్రభుత్వం పాసుబుక్కులు ప్రామాణికమని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. రేషన్‌కార్డులో సభ్యులు కానివారు, రేషన్ కార్డులో పేరు ఉండి వారి ఆధార్ లింక్ లేక పోయిన వారికి రుణం మాఫీ కాలేదు.
- రుణం తీసుకుని, చెల్లించేందుకు వీలుగా రీ షెడ్యూల్ చేసుకున్న వారికి కూడా రుణమాఫీ వర్తించలేదు.
- వీటితోపాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించని వారికి కూడా రుణమాఫీ అవలేదు. ఈ కారణాల ఫలితంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 లక్షల మందికిపైగా రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారని సమాచారం.
- గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో తొలిదఫాలో 3,77,984 మంది రైతులకు రూ.1,693.52కోట్లు మాఫీ చేసింది. రెండోసారి దశల వారీగా 3,73,213 మందికి రూ.1,191కోట్లు రద్దు చేసింది. ప్రస్తుతం రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో 1,24,167 మందికి రూ.688.42 కోట్లు మాఫీ అయ్యింది. ఈ లెక్కన చూసినపుడు దాదాపు 2.50 లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారని సమాచారం.

అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు



పలు కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం కాకుండా.. అర్హత ఉండి, మాఫీ కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకునే వీలుంది. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం వారికి రుణమాఫీ చేస్తుంది.

– శ్రీనివాస్, డీఏవో, కరీంనగర్

రుణమాఫీ కాలేదు



నాకున్న ఇరవై గుంటలపై 2020లో ఆంధ్రాబ్యాంక్(యూనియన్ బ్యాంక్)క్రాఫ్ లోన్ రూ.20వేలు ఇచ్చారు. కానీ, నాకు రుణమాఫీ కాలేదు. బ్యాంకర్లను అడిగితే లిస్ట్‌లో పేరు రాలేదంటున్నారు. ఇదెక్కడి న్యాయం? కూలీనాలీ చేసుకొని బతుకుతున్న నాకే రుణమాఫీ కాలేదంటే ఎట్లా? రూ.లక్షలోపు రుణమాఫీ చేశామని సీఎం చెప్పుతుండు. కానీ.. మాలాంటి రైతులకు ఎంతో మందికి రుణమాఫీ కాలేదు.

– కూచనపల్లి రాజు, రైతు, వీణవంక

పాస్‌పుస్తకంతో తీసుకున్న



ఒకేదఫాలో పంటరుణం మాఫీ చేస్తామని ప్రభుత్వం అంది. నాకున్న భూమి పట్టా పాసు పుస్తకం పెట్టి బ్యాంక్‌లో రూ.64 వేలు పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం మొదట లక్ష రూపాయలు లోన్ ఉన్న వారికి మాఫీ చేస్తామని చెప్పింది. నాకు రేషన్ కార్డు, పాస్ పుస్తకం ఉన్నా లోన్ మాఫీ కాలేదు. అధికారులను అడిగితే నా పేరుకు బదులు మరొకరి పేరు ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నరు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. – విరగోని శ్రీనివాస్, కాట్నపల్లి

జిల్లాకు ఆరెంజ్ అలర్ట్: ఎస్పీ

జగిత్యాలక్రైం: వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిందని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. చెరువులు, కుంటలు నిండుతున్నాయని, పిల్లలు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

న్యాయవాదులు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాలజోన్: న్యాయవాదులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ అన్నారు. జగిత్యాల బార్ అసోసియేషన్, కరీంనగర్ ఫార్చ్యూన్ మెడికేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి గుండె స్కానింగ్, 2డి ఎకో, బీపీ, ఈసీసీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని నీలిమ ప్రారంభించి మాట్లాడారు. మానసిక ప్రశాంతతకు ప్రతిఒక్కరూ ప్రయత్నించాలని సూచించారు. రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ వినిల్‌కుమార్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గంప కరుణాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, జిల్లా లీగల్ ఎయిడ్ చీఫ్ కటుకం చంద్రమోహన్, వైద్యులు పుల్లారావు, అబ్దుల్ రహమాన్, సింధురాజ్, శిబిరం ఇన్‌చార్జిలు గణేశ్, ఆర్‌ఎస్‌పి.రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ కాని వారు వ్యవసాయ అధికారులను సంప్రదించాలి


రైతు వేదికలో డ్రోన్ ప్రారంభిస్తున్న డీఏవో

ఇబ్రహీంపట్నం: రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. మండల కేంద్రంలో రైతు వేదికలో ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో మొక్కజొన్న సాగు, డ్రోన్ ద్వారా పిచికారీపై సదస్సు నిర్వహించారు. కుటుంబానికి రూ.రెండు లక్షల మాఫీ వర్తిస్తుందని, రూ.లక్ష లోపు రుణమాఫీ కానివారు వారివారి వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్తే ఎక్కడ పొరబాటు జరిగిందో వివరిస్తారని తెలిపారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్‌లింక్ ఉండాలని, లేకుంటే డబ్బులు ఖాతాకు జమ కావని తెలిపారు. రైతులు వరివైపు కాకుండా ఆయిల్ పామ్, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. డిప్యూటీ సీఈవో రఘువరణ్, ఇఫ్కో సీనియర్ మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లాలోని 8 సహకార సంఘాలకు రూ.17 లక్షలతో డ్రోన్, ఆటో, జనరేటర్ అందించామన్నారు. పొలా స శాస్త్రవేత్తలు బలారాం నాయక్, సాయినాథ్, ఏడీ ఏ లావణ్య, ఇఫ్కో జిల్లా మేనేజర్ శ్రీధర్, సాయినా థ్, సింగిల్‌విండో చైర్మన్లు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి


సమీక్షిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి, ప్రతిపాదిత పనులను అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కొనసాగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని విప్ సూచించారు. ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో సిబ్బంది నిత్యం గ్రామాల్లో పర్యవేక్షించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలన్నారు. డబ్బానుంచి కాకుండా మండల ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రత్యామ్నాయం చూడాలన్నారు. రుణమాఫీ కాని వారి జాబితాను సిద్ధం చేసి మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సాయి బాబ, ఎంపిడీవో రాంరెడ్డి, జమీర్, అధికారులు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో మాజీ మంత్రి పూజలు


మాజీమంత్రిని సన్మానిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దేవాదాయశాఖ మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈవో శ్రీనివాస్ వారికి స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌కు చెందిన పులి అమని ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అమని జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లింది. శనివారం ఉదయం ఇంటికి వెళ్లేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా తెరిచి అందులో ఉన్న తులం బంగారం, చైన్, బంగారు కమ్మలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): ఆ పల్లె ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. పంటల సాగులోని కష్టనష్టాలు తెలుసు. అవేమి వారి పిల్లలు పడకూడదని ఉన్నత చదువులు అందించారు. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులే కాకుండా న్యాయవిద్య చదువుతున్నారు. ఇప్పటికే గ్రామంలో ఇద్దరు జడ్జీలు, 30 మంది లాయర్లు, మరో 10 మంది వరకు క్లర్క్‌లుగా కోర్టులలో ఉద్యోగాలు చేస్తున్నారు. నల్లకోటు ధరించే వారి సంఖ్య గ్రామంలో అత్యధికంగా ఉండడంతో గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట కాస్త లాయర్లపేటగా స్థానికులు పిలుచుకుంటున్నారు. ఆ గ్రామ విశేషాల్లో ఓసారి పరిశీలిద్దాం..

- లింగన్నపేటలో 30 మంది అడ్వకేట్లు
- ఇద్దరు జడ్జీలు.. 10 మంది క్లర్క్‌లు
- హైకోర్టు న్యాయవాదులుగా గ్రామస్తులు

లాయర్లపేట



సండే స్పెషల్

జిల్లా కేంద్రానికి సుదూరంగా..

జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో లింగన్నపేట ఉంటుంది. గ్రామంలో దాదాపు 6వేల జనాభా ఉంటుంది. గ్రామస్తులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. చదువు విలువను గుర్తించిన ఆ గ్రామస్తులు తమ పిల్లలకు ఉన్నత విద్యనందించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులతోపాటు అత్యధిక సంఖ్యలో లాయర్లు ఉన్నారు. 30 మంది లాయర్లు, 10 మంది క్లర్క్‌లు కోర్టులలో పనిచేస్తున్నారు. ఇద్దరు న్యాయమూర్తులు(జడ్జీలు) ఇందిర, శ్రీనివాస్‌రావు కూడా ఉన్నారు. ఇదే ఊరుకు చెందిన రాంచందర్‌రావు అనే న్యాయవాది గతంలో ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. కాగా, మొట్టమొదటిసారిగా లింగన్నపేట నుంచి పి.లింగారావు అనే వ్యక్తి లాయర్ వృత్తిచేపట్టారు. ఆయన చూపినబాటలో ప్రస్తుతం వీరంతా సాగుతున్నారు. అందరివి వ్యవసాయ కుటుంబాలే. గ్రామంలో వీరికి సాగు భూములు కూడా ఉన్నాయి. సెలవుల్లో, పండుగ రోజుల్లో, బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాల సందర్భంలో లాయర్లు లింగన్నపేటకు వస్తుంటారు. న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో గ్రామస్తులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు.


లింగన్నపేట గ్రామం

పాతికేళ్లుగా న్యాయవాద వృత్తిలోనే..



మాది లింగన్నపేట. నేను 1998 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నాను. మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. వృత్తిరీత్యా హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో స్థిరపడ్డాను. గతంలో హైకోర్టులో పనిచేశాను. ప్రస్తుతం రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టులలో పనిచేస్తున్నాను. బోడుప్పల్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా 2023 నుంచి పనిచేస్తున్నాను. మున్సిపల్‌కు సంబంధించి న్యాయపరమైన అంశాలను నేనే చూసుకుంటున్నాను.

– యామన్నగారి అర్జున్‌రావు, న్యాయవాది

గర్వంగా చెప్పుకుంటాం



మా ఊరు లింగన్నపేట నుంచి దాదాపు 30 మంది లాయర్లు, ఇద్దరు జడ్జీలు, క్లర్క్‌లు ఉండడం మాకు సంతోషంగా ఉంటుంది. అప్పుడప్పుడు గర్వంగా చెప్పుకుంటాం. సాధారణ వ్యవసాయ కుటుంబాల నుంచి లాయర్లుగా ఎదిగి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ వారు ఉన్నారు. వీళ్లెప్పుడు ఊరికి వస్తుంటారు. గ్రామస్తులకు కూడా సహాయ సహకారాలు అందిస్తుంటారు.

– లింగన్నగారి దయాకర్‌రావు, గ్రామస్తుడు

37 ఏళ్లుగా పని చేస్తున్నా



మాది లింగన్నపేట గ్రామం. నేను 37 ఏళ్లగా క్లర్క్‌గా పనిచేస్తున్నాను. మా ఊరి నుంచి చాలా మంది లాయర్లు, క్లర్క్‌లు ఉన్నారు. క్లర్క్‌లుగా పనిచేసి లాయర్లు అయిన వారు కూడా ఉన్నారు. ఈ వృత్తిలో కొనసాగడం సంతృప్తికరంగా ఉంది. వీలైనంతగా మా ఊరి వాళ్లకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అందిస్తుంటాం.

– లింగన్నగారి సురేందర్‌రావు, క్లర్క్

అల్ఫోర్స్‌లో చెస్ దినోత్సవ వేడుకలు


చెస్ ఆడుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: అంతర్జాతీయ చెస్ దినోత్సవం పురస్కరించుకుని శనివారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో విద్యార్థులకు స్నేహపూర్వకమైన చెస్‌పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు 6,7వ, తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది బదిలీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో శనివారం 70 మంది సిబ్బంది బదిలీలు అయ్యారు.46 మంది జూనియర్ అసిస్టెంట్లు, 03 షరాఫ్‌లు, 21 మంది అటెండర్లను బదిలీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్‌లు సైతం బదిలీ కానున్నట్లు సమాచారం.

స్టార్టర్ల చోరీ

కమాన్‌పూర్(మంథని): గుండారం సమీపంలోని పంట పొలాల వద్ద ఉన్న బోరుమోటార్ల స్టార్టర్లను శుక్రవారం రాత్రి దొంగలు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. బోరు మోటార్లకు ఏర్పాటు చేసిన స్టార్టర్లతోపాటు విద్యుత్ తీగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వివరించారు.

కాంగ్రెస్‌ది మోసపూరిత పాలన

- రైతుభరోసా సొమ్ము ఎగ్గొట్టారు
- రుణమాఫీలోనూ కోత
- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, దావ వసంత

జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని, రైతుభరోసా సొమ్ము ఎగ్గొట్టిందని, రుణమాఫీలో కోత విధిస్తోందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటనలకు రూ.కోట్లు వృథా చేస్తున్నారని, రబీ, ఖరీఫ్‌లో చెల్లించాల్సిన రైతుభరోసా సొమ్మును మాత్రం ఎగ్గొట్టారని పేర్కొన్నారు. కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఎక్కడా అని ప్రశ్నించారు. రైతుభరోసా సొమ్ము రూ.20వేల కోట్లకు పైగా అని, అందులో కొంత రుణమాఫీకి మళ్లించి సొంత డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 40 లక్షల మందికి పైగా రూ.లక్షలోపు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీతో పోలిస్తే పావువంతు రైతులకే అర్హత ఉందా..? అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2014లో 35 లక్షల మంది, 2018లో 37 లక్షల మందికి రుణమాఫీ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పాస్‌బుక్ ప్రామాణికం అయితే రేషన్‌కార్డు ఎందుకని ప్రశ్నించారు. రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెడితే కుటుంబంలో రైతుకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని, దాని ద్వారా 18 లక్షలమంది రైతులు తగ్గే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఒక్క హామీ కూడా ఇవ్వడం లేదన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి, జగిత్యాలతోపాటు, ఇతర జిల్లాల్లో మొత్తం 94 ఆలయాలకు నిధులు మంజూరు చేయించానని పేర్కొన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణలో ప్రభుత్వం వేసిన కమిటీ ఏం చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. మాజీ జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు బాపురెడ్డి, హరిచరణ్‌రావు, కొల్ముల రమణ, జలేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- లోకల్‌యాప్‌లో ప్రకటనలు
- ఐదుగురు అంతర్‌రాష్ట్ర నిందితులు అరెస్ట్
- ల్యాప్‌టాప్, 5 మొబైళ్లు సీజ్
- బ్యాంక్ ఖాతాల నిలిపివేత
- ఎస్పీ అఖిల్ మహాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికిన ఐదుగురు అంతర్‌రాష్ట్ర సైబర్ మోసగాళ్లను రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చూపారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ వెల్లడించిన వివరాలు. ట్రెండ్జ్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ కంపెనీ పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌కు చెందిన ఎర్రబుద్ధి గోపి, కురుబా అశోక్‌కుమార్, మాదిగ బ్రహ్మేంద్ర, సత్యసాయి పుట్టపర్తి జిల్లా పరిగి మండలం సెయ్యపల్లికి చెందిన మాదిగ స్వాతిసంజీవప్ప, సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కురుబ వరలక్ష్మి అనే ఐదుగురు సైబర్ మోసాలకు పాల్పడ్డారు. ఎర్రబుద్ధి గోపి ట్రెండ్జ్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ పేరుతో డమ్మీ కంపెనీని క్రియేట్ చేశాడు. ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అనంతపూర్ జిల్లాలోని లోకల్‌యాప్‌లో ప్రకటనలు ఇచ్చారు. హెల్త్‌కేర్, పర్సనల్ కేర్, హోమ్‌కేర్, ఫ్యాషన్‌కేర్, గోల్డ్ అండ్ డైమండ్స్ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తామని.. ఇందుకు యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికారు. ఇదే కంపెనీలో ముందుగా పని కుదుర్చుకున్న అశోక్, వరలక్ష్మి, బ్రహ్మేంద్ర, స్వాతిలతో ప్రకటనలు తయారు చేయించాడు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ వారితో ఆ ప్రకటనల్లో మాట్లాడించి నమ్మకం కలిగించేలా చేశాడు. ఉద్యోగులుగా జాయిన్ అయిన వారి నుంచి రూ.10 వేలు తీసుకొని కంపెనీ గుర్తింపుకార్డు ఇవ్వడంతోపాటు మరి కొంతమందిని కంపెనీలో చేర్పించాలంటూ మోసాలకు తెరలేపాడు. కమీషన్‌తోపాటు ముందుగా డబ్బులు చెల్లించిన వారికి రూ.వెయ్యి విలువైన వస్తువులను ఇచ్చాడు. ఇలా సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన దూస రమ్య ఆ ప్రకటన చూసి ఉద్యోగం కావాలని వారికి మెసేజ్ చేయగా.. వెరిఫికేషన్ కోసం రూ.400 అడిగారు. ఆ మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా పంపడంతో జాబ్ వచ్చిందని, గుర్తింపు కార్డు కోసం రూ.5వేలు కావాలనడంతో ఆ సొమ్మును సైతం పంపింది. ఆమెకు మార్కెటింగ్‌లో తమ కంపెనీకి సంబంధించిన వస్తువులు విక్రయించాలని చెప్పడంతో రమ్య నిలదీసింది. అయితే మరో రూ.5వేలు ఇస్తే ఇంకో మంచి ఉద్యోగం చూస్తామనడంతో వారి మాటలు నమ్మిన రమ్య ఆ డబ్బును సైతం పంపింది. అప్పటి వరకు ఆమెతో మాట్లాడిన సదరు వ్యక్తులు అనంతరం ఫోన్ చేస్తే సమాధానం ఇవ్వడం మానేశారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన సిరిసిల్లటౌన్, సైబర్‌సెల్ పోలీసులు శుక్రవారం రాత్రి నిందితులను అనంతపూర్ జిల్లాలోని శారదానగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక ల్యాప్‌టాప్, ఐదు మొబైళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితులను శనివారం సిరిసిల్లలో అరెస్ట్ చూపారు. ఇదే కంపెనీపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని వాటిపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు.

ముంపు ప్రజలకు ఇబ్బంది రానీయొద్దు: జెడ్పీ సీఈఓ

మెట్‌పల్లి: ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ, స్థానిక సంస్థల పర్యవేక్షకులు రఘువరన్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం అధికారులతో సమావేశమయ్యారు. ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవం కింద ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం వేంపేట రోడ్‌లో డ్రైనేజీని పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ మోహన్, ఏఈ అరుణ్ తదితరులున్నారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: మండలంలోని రంగపేటకు చెందిన తోపారపు చిన్న నర్సయ్యను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. చిన్న నిర్సయ్య, తోకల గణపతి మధ్య భూ వివాదం నడుస్తోంది. గణపతి చిన్న నర్సయ్య భూమిలో గుంతలు తవ్వుతుండగా అడ్డుకున్నందుకు చంపుతానని బెదిరించాడు. గణపతిపై కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ఒకరి మృతి

జగిత్యాలక్రైం: కండ్లపలికి చెందిన విద్యార్థి నాయకుడు చంద సుధాకర్‌రావు (55) గుండెపోటుతో మృతిచెందాడు. 1985–90 మధ్యలో సుధాకర్‌రావు ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. కండ్లపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

బావిలో పడిన నక్కలను రక్షించిన అటవీశాఖ అధికారులు


వల నుంచి నక్కలను బయటకు తీస్తున్న అటవీశాఖ అధికారులు

కథలాపూర్: కథలాపూర్ మండలం బొమ్మెన శివారులోని ఓ వ్యవసాయ బావిలో పడిన రెండు నక్కలను అటవీశాఖ అధికారులు బయటకు తీసి అడవిలో వదిలేశారు. బొమ్మెన శివారులో తుర్తి నవీన్ వ్యవసాయ బావిలో శుక్రవారం రాత్రి రెండు నక్కలు పడ్డాయి. నవీన్ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఉదయం అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎండీ.ముషిరొద్దీన్, బీట్ ఆఫీసర్ గాండ్ల మధు రైతుల సహకారంతో నక్కలను వలల సాయంతో బయటకు తీశారు.

జ్యోతిష్మతిలో క్లౌడ్ కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్‌పై శిక్షణ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్: జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాలలో ఎడ్యునెట్ ఫౌండేషన్ అసోసియేషన్ ట్రైనర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ డాటా అనలిటిక్స్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మూడు రోజులపాటు బీటెక్ ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థినీవిద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐబీఎం, కోడ్ ఉన్నతి, ఎడ్యునేట్ ఫౌండేషన్, షాప్, టాస్క్ ద్వారా వివిధ సరికొత్త టెక్నాలజీస్‌పై విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించారు. ఐబీఎం కోర్సు శిక్షణ బయట నేర్చుకోవాలంటే ఒక గంటకి 80డాలర్లు ఖర్చవుతుందని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఆలోచించి కళాశాలలో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ ద్వారా విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యాం పెంపొందించుకొని ప్రపంచవ్యాప్తంగా ధ్రువీకరించబడిన సర్టిఫికెట్లు అందుకుంటారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌రావు, డీన్ అకాడమిక్స్ పీకే వైశాలి, సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ జగదీశన్, కోఆర్డినేటర్ సింధుషా పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ భూములను రక్షించండి

జగిత్యాలటౌన్: జిల్లాలోని ఎస్సారెస్పీ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని, అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు శనివారం లేఖ రాశారు. కాకతీయ కాలువల తవ్వే సమయంలో రైతుల నుంచి సేకరించిన భూముల వివరాలు నీటిపారుదల, రెవెన్యూ అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయని, ధరూర్, నర్సింగాపూర్, అంతర్గాం, అంబారిపేట, హస్నాబాద్, చల్‌గల్, తాటిపల్లి పరిధిలోని భూములను సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జిల్లాకేంద్రం శివారులో ఉన్న చెరువుల బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై దర్యాప్తు జరిపించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. జగిత్యాల మండలంలోని మోతె, కండ్లపెల్లి, తిప్పన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల పరిధిలోని ముప్పారపు చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందన్నారు. చెరువుల ఆక్రమణతో రైతులు, గంగపుత్రులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన మున్సిపల్ కార్మికుడు దుబ్బ గంగాధర్ (32) చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. గంగాధర్ జగిత్యాల మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జూన్ 28న క్రిమి సంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మన్సూర్‌ఖాన్ తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్ తప్పనిసరి కాదు

- చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్‌రెడ్డి
- 'సాక్షి'తో పలు వివరాలు వెల్లడి



సిరిసిల్ల : విదేశాల్లో స్థిరపడి ఆదాయం పొందుతూ.. పుట్టి పెరిగిన ప్రాంతాల్లో ఆస్తులు సంపాదించే వారు ఎందరో ఉన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పరిపాటి. కానీ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి.. అక్కడే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, భవన నిర్మాణ రంగాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు చాలా మంది ఉన్నారు. వీరంతా ప్రతినెలా తమ కుటుంబ సభ్యులకు డబ్బులు పంపిస్తుంటారు. అయితే వారంతా మన వద్ద ఆదాయపన్ను చెల్లించాల్సి ఉంటుందా? ఎంతమేరకు చెల్లించాలి? విదేశాల నుంచి ఏడాదిలో గరిష్టంగా ఎంతమేరకు పంపవచ్చు? ఎన్‌ఆర్‌ఐలకు ఆధార్‌కార్డు ఉండాలా? వంటి ప్రశ్నలకు కరీంనగర్‌కు చెందిన ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు.

ఎంత సొమ్ము అయినా..

ఉద్యోగ, ఉపాధి కోసం వివిధ దేశాల్లో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐలు ఇండియాలో ఉన్న రక్తసంబంధీకులకు ఎంత మొత్తంలోనైనా డబ్బులు పంపవచ్చు. దీనికి ఆర్‌బీఐ సీలింగ్ ఏమి విధించలేదు. ఇది మంచి ట్యాక్స్ ప్లానింగ్ అంశం. ఆదాయ పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. విదేశాల్లో చదువులకు, ట్రీట్‌మెంట్‌కు, అప్పులకు, అవసరాలకు డబ్బులు పంపవచ్చు. ఒక వేళ ఇండియాలోని స్థిరాస్తులను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బులను ఎన్‌ఆర్‌ఐలు విదేశాలకు తీసుకెళ్లవచ్చు. కానీ ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక్క మిలియన్ యూఎస్ డాలర్లు (అంటే రూ.8కోట్ల)కు మించి తీసుకెళ్లడానికి అవకాశం లేదు.

పన్ను చెల్లించాలి

ఏటా రూ.3లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న ఎన్‌ఆర్‌ఐలు తప్పనిసరిగా ఆదాయపన్ను రిటర్న్ ఫైల్ చేయాలి. ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో సాధారణంగా స్థిరాస్తులపై అద్దె, ఎన్‌ఆర్‌వో అకౌంటర్‌లో వడ్డీ, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ నుంచి డెవిడెండ్, షేర్ మార్కెట్ ట్రేడింగ్ లాభాలు వంటి ఆదాయాలపై పన్నులు చెల్లించాల్సిందే. ఒక్కోసారి ఎన్‌ఆర్‌ఐలకు ఇండియన్ కంపెనీల నుంచి జీతాలు వస్తుంటాయి. ఇలాంటి ఆదాయం రూ.3 లక్షలు దాటితే ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో ట్యాక్స్ పరిధిలోకి వచ్చే వ్యవహారం ద్వారా పేమెంట్ చేయాల్సి వస్తే ఫామ్ 15సీఏ/15 సీబీ ఫైల్ చేస్తేనే బ్యాంకర్ డబ్బులు ఎన్‌ఆర్‌ఐకి పంపించడం జరుగుతుంది. ఏమైనా సందేహాలు ఉంటే సీఏను సంప్రదించాలి.

వ్యవసాయభూములు కొనరాదు

ఎన్‌ఆర్‌ఐలు ఇండియాలో వ్యవసాయ భూములు కొనరాదు. ఇతర స్థిరాస్తులు కొనుగోలు చేయవచ్చు. ఇండియా వ్యవసాయాధారిత దేశం కావడంతో ఎన్‌ఆర్‌ఐలు వ్యవసాయ భూములు కొంటే.. పడావులుగా ఉంచుతారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారని ఈ నిబంధనలు పెట్టారు. కానీ వారసత్వంగా వచ్చే వ్యవసాయ భూములను వారి పేరిట మార్చుకోవచ్చు, అనుభవించవచ్చు.

పన్ను చెల్లించకుంటే శిక్ష

ఆదాయపన్ను చట్టం 1961 ప్రకారం ఎన్‌ఆర్‌ఐలకు ఇండియాలో పన్నులు చెల్లించే ఆదాయం ఉండి రిటర్నులు ఫైల్ చేయకుంటే శిక్షార్హులు. వడ్డీలు, ఫెనాల్టీలతో సహా డిమాండ్ నోటీస్ అందిస్తారు. దానికి స్పందించకపోతే ఎన్‌ఆర్‌ఐలకు చెందిన ఇండియాలోని బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేస్తారు. స్థిరాస్తులను అటాచ్ చేస్తారు. ఎన్‌ఆర్‌ఐ నివసించే దేశంలోని మన ఎంబసీ ద్వారా చర్యలు తీసుకుంటారు.

పాన్‌కార్డు ఉండాలి

ఇండియాలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పాన్‌కార్డు ఉండాలి. ఎన్‌ఆర్‌ఐకి ఆధార్‌కార్డు తప్పనిసరి కాదు. ఆధార్‌కార్డు కావాలంటే.. ఇండియన్ అడ్రస్‌తో సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చని యూఐడీఏఐ నిబంధన.